క్లుప్తంగా

పెయింటర్ల సమస్యలు పరిష్కారానికి కృషి

పాలకొల్లు అర్బన్: పెయింటర్ల సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. పాలకొల్లు ది ఆర్టిస్ట్స్ అండ్ పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో బుధవారం గుడాల గోపి, విజయలాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణలను సత్కరించారు. సంఘ మొదటి అంతస్తు స్లాబు వేయడానికి, సంఘ కార్యాలయ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని గుడాల గోపికి పెయింటర్లు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, సంఘ అధ్యక్షుడు నీలం రవి, గౌరవ అధ్యక్షుడు వల్లూరి రామబ్రహ్మం, కార్యదర్శి సమతం చంద్రరావు, కోశాధికారి బొప్పె సాంబమూర్తి, తాళ్ల బాలసుబ్రహ్మణ్యం, గొన్నాబత్తుల సత్యనారాయణ, నీల్‌కమల్ మూర్తి, బొంతు వెంకట తిరుమలరావు, బొప్పె దుర్గాప్రసాద్, కాసా వీరభద్రం, చలపాటి నాగేంద్ర, సోమాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్ల పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత కృష్ణంరాజు

పాలకోడేరు: గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ నేత కలిదిండి కృష్ణంరాజు పేర్కొన్నారు. శృంగవృక్షం మురళీకృష్ణం రాజు సేవా సమితి వ్యవస్థాపకుడు కలిదిండి కృష్ణంరాజు బుధవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి, విందు ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో గ్రామానికి మరింత తోడ్పాటు అందిస్తానని కృష్ణంరాజు అన్నారు. కార్యక్రమంలో జంగం సూరిబాబు, వైస్ ఎంపీపీ సోడదాసి నరేష్ ఉపసర్పంచ్ కలిదిండి ఆనందరాజు, ఎంపీటీసీ మల్లుల సూర్యకళ, క్రొవ్విడి దుర్గ, మాజీ సర్పంచ్ బంగా రమణబాబు, గునుపూడి శ్రీనివాస్, పెనుమాల రిచి, సత్యనారాయణ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు దొంగ సత్యనారాయణ, దిలీప్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు విష్ణు విద్యార్థులు


మోహన్‌చంద్, శశాంక్

సాక్షి, భీమవరం: సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ పోటీలకు భీమవరం విష్ణు కళాశాల విద్యార్థులు ఏవీఎస్ శశాంక్, ఎస్ మోహన్‌చంద్ ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు బుధవారం చెప్పారు. గత నెల 28, 29 తేదీల్లో కృష్ణా జిల్లా మైలవరం లోని లక్కిరెడ్డి బాల్‌రెడ్డి కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూకే బాస్కెట్‌బాల్ సెలక్షన్స్‌లో తమ విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు ఈనెల 13 నుంచి 18 వరకు కేరళలోని యూనివర్శిటీ ఆఫ్ కేరళలో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారని శ్రీనివాసరావు వివరించారు.

అర్హులతోనే ఓటరు జాబితా


ఉండిలో మాట్లాడుతున్న డీపీఓ మల్లికార్జునరావు

ఉండి: అర్హులతోనే ఓటరు జాబితా సిద్ధం చేస్తామని జిల్లా పంచాయితీ అధికారి, నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మల్లికార్జునరావు అన్నారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో బూత్‌లెవెల్ అధికారు, రెవెన్యూ సిబ్బందితో ముసాయిదా ఓటరు జాబితా సవరణలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటికే విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో తప్పొప్పుల సవరణపై మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీల నాయకుల సూచనలు, అభ్యంతరాలు పరిగణలోనికి తీసుకోవాలని అన్నారు. ఈ వ్యవహారమంతా డిసెంబర్ 9లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత


భీమవరం ఆస్పత్రిలో జుజ్జూరి అప్పలనరసమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ గొర్ల దుర్గ భవాని

పాలకోడేరు: క్యాన్సర్‌తో బాధపడుతూ భీమవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న పాలకోడేరు గ్రామానికి చెందిన జుజ్జూరి అప్పలనరసమ్మకు వలంటీర్ గొర్ల దుర్గాభవాని బుధవారం పింఛన్ అందజేశారు. పాలకోడేరు సచివాలయం–2 నుంచి భీమవరం ఆసుపత్రికి దుర్గాభవాని వెళ్లి పింఛన్ అందజేయడంతో అప్పలనరసమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

పొట్టి శ్రీరాములు ఆశయాలను గుర్తుంచుకోవాలి

పాలకొల్లు అర్బన్: తెలుగు మాట్లాడేవారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను ప్రతీ ఒక్కరూ గుర్తు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజనలో ఆంధ్రప్రదేశ్‌కి రావాల్సిన రాయితీలు, నిధులు రాబట్టడం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర విభజనలో ఏపీకి జరిగిన నష్టం భవిష్యత్‌లో రాకూడదనే తలంపుతో మూడు రాజధానులు ఏర్పాటు చేసి సమానంగా అభివృద్ధి చేయాలని సీఎం జగన్ ఆశిస్తున్నారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు అండగా నిలవాలని గుడాల గోపి కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, జిల్లా కార్యదర్శి కొండేటి రవి, పార్టీ నాయకులు కోట రత్నరాజు, గుండుబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో....

పట్టణంలోని శ్రీ వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలోనూ, అలాగే తహసీల్దార్ కార్యాలయం వద్ద, గాంధీబొమ్మల సెంటర్‌లో గల పొట్టి శ్రీరాములు విగ్రహాలకు సంఘ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం శ్రీరాములు ప్రాణత్యాగం చేశారన్నారు. సంఘ నాయకులు మామిడి వెంకటేశ్వరరావు (బాబు), నాళం వెంకట సోమేశ్వర బాపిరాజు, భోగవిల్లి నాగభూషణం, చక్కా చినగొల్లబాబు, శ్రీఖాకొల్లు కామేశ్వరరావు, సలాది జనార్ధనరావు, మురహరి ఈశ్వరరావు, కొత్త వెంకట చంద్ర సోమరాజు, విరాట్ల శ్రీను, కారుమూరి సూర్యనారాయణ, కర్పూరం వెంకటేశ్వరరావు, మన్యం జగ్గమ్మగారి సత్రం చైర్మన్ నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పాలకొల్లు అర్బన్: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)


పాలకొల్లు అర్బన్: గాంధీబొమ్మల సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘ నాయకులు


నరసాపురం: సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆర్డీవో అంబరీష్


నరసాపురం: మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణ

నరసాపురంలో..

నరసాపురం: ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నరసాపురం ఆర్డీవో ఎం.అత్యుత్ అంబరీష్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషాసంయుక్త రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు తన ప్రాణాన్ని త్యాగం చేశారని చెప్పారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్ష ఫలితంగా 1952లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మన ఆంధ్ర రాష్ట్రాన్ని ఇచ్చారని అన్నారు. అంతభావం, చిత్తశుద్ధితో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో...

మున్సిపల్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీజీబీఎస్ మహిళా కళాశాలలో

ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం బీజీబీఎస్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సీ.నీరజ, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి కె.రజనీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని చెప్పారు.

కారు అద్దెకు తీసుకుని ఉడాయించిన వ్యక్తిపై కేసు

నరసాపురం రూరల్: కారు అద్దెకు తీసుకుని కొన్ని రోజులపాటు నమ్మకంగా అద్దె చెల్లించి నమ్మకం కలిగించి అనంతరం కారుతో సహా ఉడాయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు నరసాపురం రూరల్ ఎస్సై గుర్రయ్య తెలిపారు. మండలంలోని చిట్టవరం గ్రామానికి చెందిన కాటూరి శ్యామ్ తనకు చెందిన షిఫ్ట్ కారును అమలాపురానికి చెందిన బీరా కృష్ణంరాజుకు రోజువారీ అద్దె చెల్లించే ప్రాతిపదికన అద్దెకు ఇచ్చాడు. అయితే కొంత కాలంగా అద్దె చెల్లించకపోవడంతోపాటు తన కారును కూడా తిరిగి ఇవ్వడం లేదంటూ శ్యామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

నరసాపురం: నరసాపురం డివిజన్‌లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటి సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ కోరారు. బుధవారం నరసాపురం ఆర్డీఓ ఎం.అత్యుత్ అంబరీష్‌ను కలసి సమస్యలు వివరించారు. ఆర్డీఓ సానుకూలంగా స్పందించినట్లు బాలకృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో బల్ల పరమేశ్వరరావు, గంటా మోహన్‌రావు పాల్గొన్నారు.

పంట బోదెల ప్రక్షాళనకు చర్యలు


తూర్పుపాలెంలో వలంటీర్ల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


తూర్పుపాలెంలో ఇలపర్రు సమస్యలపై చర్చిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: సాగుకు నీరు సక్రమంగా అందేందుకు పంట బోదేల ప్రక్షాళనకు చర్యలు తీసుకోనున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. ఆచంట వేమవరంలో శివారు భూములకు నీటి ఎద్దడిపై తూర్పుపాలెంలో ఆచంట వేమవరం గ్రామ రైతులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఆచంట వేమవరంలో నీరు సక్రమంగా అందేందుకు ప్రధాన కాలువల్లో తూడు తొలగించినట్లు తెలిపారు. పంటబోదేల ఇబ్బందులపై రైతాంగం సహకరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వారంతా సహకరిస్తే త్వరలోనే వాటి ప్రక్షాళన చేపడతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కంశెట్టి చంటి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వలంటీర్ల పనితీరుపై సమీక్ష

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందించే విధంగా వలంటీర్ల పనితీరుపై తూర్పుపాలెంలో అధికారులు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. వలంటీర్లు సక్రమంగా పనిచేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పేదలకు అండగా ఉండేందుకు వలంటీర్లను నియమించామని, కొందరు అందుబాటులో ఉండడం లేదన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయన్నారు. వీటిని పునఃసమీక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీలు పుతీనీడి వెంకటేశ్వరరావు, కేవీఎన్ నారాయణ రెడ్డి(వాసు). జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వరరెడ్డి, పోడూరి రామయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ తానేటి మల్లిలు పాల్గొన్నారు.

ఇలపర్రు శ్మశాన వాటిక సమస్యకు పరిష్కారం

ఇలపర్రులో శ్మశాన వాటిక సమస్యకు పరిష్కారం చూపుతామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. బుధవారం తూర్పుపాలెంలో ఇలపర్రు చెందిన ఎస్సీ సంఘాల నాయకులు కలిసి సమస్యను విన్నవించుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. అదే విధంగా గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి


జగనన్న కలనీలో ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో చర్చిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: జగనన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పనులు పూర్తియ్యేలా అధికారులు చొరవ చూపించాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. నరసాపురం అర్బన్ మంగళగుంటపాలెం జగనన్న లేఅవుట్‌ను ముదునూరి బుధవారం సందర్శించారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. స్థానికంగా ఉన్న ఇబ్బందులుపై ఆరా తీశారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అధికారలుతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ నవరత్నాల పథకంలో భాగంగా పేదలందరికీ ఇళ్ల నిర్మాణం చేయాలని ప్రభుత్వం జగనన్న కాలనీల నిర్మాణాలను ప్రతిష్టాత్మకం చేపట్టిందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న లెవిలింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకున్న లబ్ధిదారులతో అధికారులు తరచూ మాట్లాడి, వారికి ఎలాంటి ఇబ్బందులున్నా పరిష్కరించాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకునేలా సహకారం అందించాలని పేర్కొన్నారు. కాలనీలో అంతర్గత రోడ్లు, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కల్పన చేయాలన్నారు.ఆయన వెంట హౌసింగ్ పీడీ ఆనంద్‌కుమార్, ఈఈ బీవీ రమణ, నరసాపురం తహసీల్దార్ ఎస్ఎం ఫాజిల్, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, హౌసింగ్ డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ రవీంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా సత్యనారాయణ, గోరు సత్తిబాబు ఉన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం


క్రీస్తు ఉపవాస కూడికల సభలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ అచ్యుతరావు

యలమంచిలి: క్రీస్తు బోధించిన శాంతి, సహన, ప్రేమ మార్గాలు సర్వమానవాళికి అనుసరణీయమని కొంతేరు సరందరుపేట చర్చి పాస్టర్ అచ్యుతరావు అన్నారు. చర్చిలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఉపవాస కూడికలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ సభలో అచ్యుతరావు మాట్లాడుతూ క్రీస్తు మార్గంలో అందరూ నడవడం ద్వారా ప్రపంచ శాంతికి కృషి చేద్దామన్నారు. మరొక పాస్టర్ రెవరెండ్ ఆదాం లింకన్ మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఎదురైన సత్యమార్గంలో నడచిన వారికే అంతిమ విజయమని క్రీస్తు ఆచరించి నిరూపించారన్నారు. మనం కూడా తోటి వారితో ప్రేమతో వ్యవహరిస్తూ ఆయన మార్గంలో పయనిద్దామన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు లంక చిరంజీవి, కొండేటి వరదరాజు, కనపాల మోహనరావు, లంక రవిబాబు, కనపాల నాగరాజు, చదలవాడ సురేష్, కనపాల చిన్న తదితరులు పాల్గొన్నారు.

వీరమ్మ పార్క్ వద్ద మెప్మా అర్బన్ మార్కెట్


వీరమ్మ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్

భీమవరం(ప్రకాశం చౌక్): మెప్మా పరిధిలో ఉన్న స్వయం సహాయక సభ్యులు తయారు చేసే వస్తువులు ప్రదర్శన, అమ్మకానికి మూడో విడత అర్బన్ మార్కెట్ వీరమ్మ పార్క్ వద్ద ఏర్పాటు చేశారు. అర్బన్ మార్కెట్ మొదట జులై నెలలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా పట్టణంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు సీహెచ్ కృపామణి, సెక్రెటరీ అనంత లక్ష్మి, మెప్మా సిటీ మిషన్ మేనేజరు సీహెచ్ నానిబాబు, సీఓలు సంతోషమ్మ, జయకృష్ణ, పెద్దింట్లమ్మ, సమాఖ్య ఆర్పీలు, ఓబీలు, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళిక

పెనుగొండ: ఖరీఫ్–2023 ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తు ప్రణాళిక రూపొందించినట్లు మండల వ్యవసాయాధికారి పి.స్పందన తెలిపారు. బుధవారం పెనుగొండ మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రొక్యూర్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించిన కొనుగోలుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. మండలంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, గ్రామ రెవెన్యూ అధికారులకు, మిల్లర్లకు కమిటీ సూచనలు చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సీజన్ నుంచి ధాన్యం సేకరణకు వినియోగించే ప్రతీ వాహనానికి జీపీఎస్ ఏర్పాటు చేస్తున్నామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవ్‌కుమార్ వివరించారు. 2,3 తేదీల్లో పెనుగొండ ఏఎంసీలో జీపీఎస్ పరికరాలను వాహనాలకు బిగించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.గురుమూర్తి రెడ్డి, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ దొరలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అమ్మవారి ఊరేగింపు

ఆకివీడు: సన్మార్గానికి ఆధ్యాత్మికతే మూలమని, దైవానుగ్రహంతో ఏదైనా సాధించవచ్చని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్ అన్నారు. స్థానిక మాదివాడలోని శ్రీ కృష్ణ దేవరాయ యూత్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గుర్రాల రథంలో అమ్మవారిని పట్టణంలో ఊరేగించారు. ఊరేగింపులో ఎనిమిది రకాల నృత్య బృందాలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపును ప్రారంభించిన రమేష్ మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు బానిస కాకుండా దైవ కార్యక్రమాలు, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గత 15 రోజులుగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో భక్తి భావం పెరగడంతోపాటు పలువురు కళాకారులకు భుక్తి లభించిందని అన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ యూత్ ప్రతినిధులు మోటుపల్లి రామాంజనేయులు, కోడేటి శ్రీనివాస్, అడ్డాల శ్రీనివాసరావు, రామారావు, సత్తినీడి మణికంఠ, మొగిలి కిరణ్, వానపల్లి తేజ, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై ఇరుక్కున్న కార్ల కంటైనర్


గరగపర్రు వంతెనపై ఇరుక్కున్న కంటైనర్

పాలకోడేరు: భీమవరం – తాడేపల్లిగూడెం మార్గంలో గరగపర్రు వంతెన టర్నింగ్‌లో కార్ల కంటైనర్ బుధవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఇరుక్కుపోయింది. దీంతో సుమారు ఆరు గంటల పాటు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తాడేపల్లిగూడెం హైవే నుంచి గరగపర్రు మీదుగా భీమవరంలోని ఓ కార్ల కంపెనీకి వెళ్లాల్సిన కంటైనర్ వంతెన వద్ద ఇరుక్కుపోయినా కార్ల కంపెనీ యాజమాన్యం స్పందించకపోవడంతో స్థానికులు, వాహనచోదకుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో సాయంత్రం యంత్రాల సాయంతో కంటైనర్‌ను వంతెన మలుపు ప్రాంతం తప్పించి ముందుకు తీసుకెళ్లారు. ఆ సమయంలో వంతెన రెయిలింగ్ కొంతవరకు దెబ్బతింది. గతంలో కూడా ఇలాగే ఈ కార్ల కంటైనర్ ఇరుక్కోవడంతో ఈ మార్గంలో వీటిని తీసుకురావద్దంటూ స్థానికులు, అధికారులు హెచ్చరించినా ఫలితంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

రేపు మోటార్ సైకిళ్ల వేలం

నరసాపురం: వివిధ కేసుల్లో పట్టుబడ్డ మూడు మోటార్ సైకిళ్లను శుక్రవారం నరసాపురం ఎస్ఈబీ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ స్టేషన్ అధికారి డి.సురేఖ చెప్పారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వేలంలో పాల్గొనే వారు ఉదయం 11 గంటలకు ఎస్ఈబీ కార్యాలయానికి వచ్చి రూ.2 వేలు ధరావతు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

ఎంపీడీఓకు పదోన్నతి

ఉండి: స్థానిక ఎంపీడీఓ ఏవీ అప్పారావు పదోన్నతిపై బుధవారం బదిలీ అయ్యారు. ఆయనకు భీమవరం డివిజన్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ)గా పదోన్నతి లభించింది. ఆయన స్థానంలో మరొకరిని నియమించాల్సి ఉంది.

ఘర్షణ కేసులో ఇద్దరి అరెస్టు

ఆకివీడు : స్థానిక జాతీయ రహదారిపై కైకలూరు బస్‌స్టాప్ వద్ద ముఠా కార్మికులపై దాడి చేసిన ఘటనలో నక్కా మహేష్, హంసపరుగుల నానిలను బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్సై నాగబాబు తెలిపారు. మద్యం మత్తులో ముఠా కార్మికులపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిని అరెస్టు చేయగా, గాయాలతో ఉన్న మరో వ్యక్తి రాజమండ్రి ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారని పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

ఉండి: మండలంలోని పాములపర్రు శివారు మొండిగూడెంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.1800 నగదు, మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై సూర్యనారాయణ తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ వెంకటస్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి అన్నారు. స్థానిక 1, 4 వార్డుల్లో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని, ఉచితంగా రక్త, ఈసీజీ, ఇతర పరీక్షలు ఉచితంగా చేసి, మందులు అందజేస్తున్నారని తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య మాట్లాడుతూ అవసరమైన వారికి కార్పొరేట్ ఆసుపత్రిలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం చేయిస్తున్నట్టు చెప్పారు. అవసరమైన వారికి కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు, ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్నారని తెలిపారు. ప్రజారోగ్యం కోసం సీఎం జగన్ వేల కోట్ల నిధులను ఖర్చు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, గూడూరి ఉమాబాల, కోడె యుగంధర్, నల్లం రాంబాబు, పేరిచెర్ల సత్యనారాయణరాజు, చెల్లబోయిన సూర్యప్రకాష్, ముత్యాల రామారావు, అల్లూరి రాజేష్ రాజు కందికట్ల ఎడ్వర్డ్, నందమూరి ఆంజనేయులు, బలే యేసుబాబు పాల్గొన్నారు.

అజ్జమూరు చానల్‌లో గుర్రపుడెక్క తొలగింపు


అజ్జమూరు చానల్‌లో గుర్రపుడెక్క తొలగిస్తున్న దృశ్యం

ఆకివీడు: అజ్జమూరు చానల్‌లో గుర్రపుడెక్క తొలగింపు పనులు బుధవారం చేపట్టారు. ఆకివీడులోని వెంకయ్య వయ్యేరు పంట కాలువ నుంచి అజ్జమూరు, కుప్పనపూడి, కోనలపల్లి, దొడ్డనపూడి గ్రామ ఆయకట్టుకు నీరందించే అజ్జమూరు చానల్‌లో గుర్రపుడెక్క, తూడు పేరుకుపోయాయని రైతులు ఆర్బీకే సమావేశాల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో వచ్చే రబీ సీజన్‌కు నీటి ఎద్దడి తలెత్తకుండా ఆయా గ్రామాల్లోని పంట కాలువలకు సాగునీరందించే అజ్జమూరు చానల్‌లో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా తూడు తొలగింపునకు శ్రీకారం చుట్టామని అజ్జమూరు, కుప్పనపూడి ఆర్బీకే చైర్మన్‌లు నంద్యాల చల్లారావు, కృష్ణమాచార్యులు తెలిపారు.